విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 26, డిసెంబర్ 2022

బంజారాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-అవుకు : రాష్ట్రంలోని బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సుగాలి వెంకటరమణ నాయక్ అన్నారు. ఆదివారం కడప పట్టణంలోని వైయస్సార్ ఆడిటోరియంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ నాయకులు రిటైర్డ్ ఐజి కొర్ర జగన్నాధ రావు, రిటైర్డ్ డిజిపి డిటి నాయక్ లు హాజరైన ఈ నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అవుకు పట్టణానికి చెందిన సుగాలి వెంకటరమణ నాయక్‌ను రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతి సమస్యలపై పోరుబాట చేపట్టి, జాతి శ్రేయస్సు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. అన్ని జిల్లాలలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అన్ని జిల్లాల అధ్యక్షులు, బంజారా సోదరులు పాల్గొన్నారు.

సంవత్సరాలుగా శుద్ధ జల కేంద్రాలు మూతేనా!

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండలంలోని అతిపెద్ద గ్రామమైన అంకిరెడ్డి పల్లెలో శుద్ధ జలం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 7వేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలో ప్రజలకు శుద్ధ జలం అందించడానికి ప్రభుత్వం నాలుగు శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేయగా మూడు మూతపడి,ఒకటి మాత్రం డబ్బులు చెల్లించి త్రాగునీరు తీసుకువెళ్లేదిఉన్నది. అనంతపురం జిల్లా బుగ్గ నుండి కొందరు ఆటోలో జలాన్ని తీసుకువచ్చి నీటి వ్యాపారం చేస్తున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) లో రెండు ఉండగా ఒకటి అల్ట్రాటెక్ వారు ఏర్పాటు చేసిన కేంద్రం,మరొకటి ప్రభుత్వానిది,ఇంకొకటి ఎస్సీ కాలనీ కి వెళ్లే రహదారిలో,మరొకటి రవి ప్రకాష్ ఇంటి సమీపంలో ఉన్నది. ప్రకాష్ ఇంటి సమీపంలో ఉన్నది తప్ప,మిగిలిన మూడు కొన్ని సంవత్సరాలుగా మూతపడి ఉన్నాయి. గ్రామంలో దిష్టిబొమ్మలాగా వృధాగా పడి ఉన్నాయి. గ్రామానికి చుట్టుపక్కల లోతైన నాపరాతి గనులలోని నిలిచిన నీరు తాగి అనారోగ్యం పాలు కాకుండా ప్రజల కోసం ప్రభుత్వం శుద్ధ జల కేంద్రాలు ఏర్పాటు చేసిన నిరుపయోగంగా మారాయి. ప్రజల ఆరోగ్యం కోసం మంచినీరు అందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన కేంద్రాలు సంవత్సరాల తరబడి మూతపడడం గమనార్హం. అటుపాలకులు ఇటు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమకు అంకిరెడ్డి పల్లె దత్తత గ్రామముగా ఉన్న కనీసం శుద్ధ జలం కూడా అందుకోలేని దుస్థితిలో ఉన్నది. కొన్ని సంవత్సరాలుగా కేంద్రాలు మూతపడడానికి ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ శుద్ధ జలం గ్రామస్తులకు అందడం లేదన్నది మాత్రం వాస్తవం. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకుని మూతపడిన శుద్ధ జల కేంద్రాలను తెరిచి శుద్ధ జలాన్ని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెల్లరేషన్ కార్డు దారులపై జగన్ భస్మాసుర హస్తం

విశాలాంధ్ర - నంద్యాల : అవ్వాతాతల రేషన్ కార్డుదారులపై ముఖ్యమంత్రి జగన్ భస్మాసుర హస్తం పెట్టారని నంద్యాల

మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇదేమి కర్మ కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణం 37వ వార్డులో ఇదేమికర్మ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే భూమా అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఇంఛార్జి మంజుల వెంకటస్వామి ఆధ్వర్యంలో కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే భూమాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమా ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూమా మాట్లాడుతూ కరెంట్ బిల్లు తదితర కారణాలు చూపి మరోసారి లక్షల మంది పేదల రేషన్ కార్డులు ఎత్తువేతకు జగన్ సర్కార్ సిద్ధమయిందన్నారు. అలాగే ఏదో ఒక సాకు చూపి అవ్వ తాతల పింఛన్లు కూడా జగన్ ప్రభుత్వం రద్దు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖలీల్, వలి, వినయ్, భాస్కర్ రెడ్డి, సూరి, తిమ్మయ్య, శ్రీరాములు, నాగార్జున, జైనాబి, మస్తాన్,ప్రసాదు రెడ్డి, సుబ్బరాయుడు, శేఖర్, బుజ్జి, తెలుగు దేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరుకు దారి...సమస్య తీర్చేవారేరి

విశాలాంధ్ర-చాగలమర్రి :చాగలమర్రిలోని ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్

తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్యా లపాడు బస్టాండు నుంచి పెద్దమకానం వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాలు వచ్చిన ప్రతిసారీ గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముత్యాల పాడు బస్టాండులో కొద్దిమేర,పెద్దమకానం నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు రహదారిని వెడల్పు చేశారు. బసవన్న కట్ట నుంచి పెద్దమకానం వరకు రహదారి వెడల్పు పట్టించుకోక పోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

ధర్మారెడ్డి కి ప్రముఖుల పరామర్శ

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా : పుత్రవియోగంతో బాధపడుతున్న టిడిపి ఈవో, ఐఏఎస్ అధికారి, ధర్మారెడ్డిని ఆదివారం బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పారుమంచాల గ్రామానికి చేరుకొని పరామర్శించి ఓదార్చారు. వీరితోపాటు ఉపముఖ్యమంత్రి నారాయణ కృష్ణ, గ్రేహౌండ్స్ డి ఐ జి ఎస్పీ గోపీనాథ్ జెట్టి, సెబ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, ఎస్పి అంబిరెడ్డి పారుమంచాల గ్రామానికి చేరుకొని పరామర్శించారు. ముందుగా చంద్రమౌళి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళిపించారు, ధర్మారెడి నీ పరామర్శించి ధైర్యం చెప్పారు.

నారా లోకేష్ ను కలిసిన మొమిన్ అహ్మద్ హుసేన్

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : హైదరాబాద్ లోని చంద్రబాబు నాయుడు

నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో జరిగిన చర్చలో పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మొమిన్ అహ్మద్ హుసేన్, 6వ వార్డు కౌన్సిలర్ ముఫ్తి నూర్ మొహమ్మద్,టీడీపీ ట్రైనర్ నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి మొమిన్ ముస్తఫా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలపై ఎప్పుడూ లేని విధంగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు స్పందించమని చెప్పారు. ప్రజల్లో ఉండి, వారికి జగన్ ప్రభుత్వం చేస్తున్న దాడులపై, హామీలపై చేసిన మోసాలను వివరించాలన్నారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న పలు సమస్యలను నాయకులు నారా లోకేశ్ కు వివరించారు.

పద్మశాలీలు రాజకీయంగా రాణించాలి

విశాలాంధ్ర - నంద్యాల : పద్మశాలీలు ఐకమత్యంగా మెలిగి రాజకీయంగా

ముందుకు పోవాలని అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి పేర్కొన్నారు. ఆదివారం జంబులా పరమేశ్వరి దేవస్థానం కళ్యాణమండపం నందు కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, ఉపాధ్యక్షులు వద్ది నరసింహులు,ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాయలసీమ పద్మశాలి సంఘం అధ్యక్షులు కొంకతి లక్ష్మీనారాయణ, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జివి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అందులో భాగంగా కందగట్ల స్వామి,కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు భీమనపల్లె వెంకట సుబ్బయ్యలు మాట్లాడుతూ పేదల అక్కాచెల్లెళ్లకు జీవనోపాధి కోసం సంక్రాంతి కానుకగా ఉచితముగా కుట్టు మిషన్లు ఇవ్వాలని తీర్మానించామన్నారు. ప్రతిభా పురస్కారానికి సహకరించిన కుల బాంధవులైన దాతలకు హృదయపూర్వక ధన్యాదములు తెలిపారు. ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కొంకతి లక్ష్మీనారాయణ, కోస్తాంధ్ర అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, కడప జిల్లా అధ్యక్షులు సాయి వెంకటకృష్ణ,కార్యదర్శి మద్దాల మోహన్, గుద్దేటి వెంకటరామయ్య, సాదు సూర్య నారాయణ, చెన్నా వెంకటేశ్వర్లు, పద్మశాలీయ కుల బాంధవులు పాల్గొన్నారు.

నూతన క్యాలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం సమత విద్యానికేతన్‌లో బలిజ, కాపు సేవాసమితి అధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. బలిజ, కాపు సేవాసమితి వ్యవస్థాపకులు, కరుణామయ విద్యాసంస్థల చైర్మన్ దండే దస్తగిరి మాట్లాడుతూ సేవాసమితి ప్రారంభించిన అనతికాలంలో ఆర్థికంగా వెనుకబడిన బలిజ సంఘీయులకు విద్య, వైద్యం,ఉద్యోగాల కల్పనలో ముందుకు తీసుకువెళున్నామని, నంద్యాలలో ఉన్న బలిజ,కాపు సామాజిక వర్గం వారికి నూతన సంవత్సర క్యాలండర్ అందివ్వడం జరుగుతుందన్నారు. రవికిందర్ గార్డెన్ కరస్పాండెంట్,మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రమణ్యం ,సేవాసమితి అధ్యక్షులు కొప్పుల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి దండే వెంకట నరేష్, సమత విద్యానికేతన్ కరెస్పాండెంట్ బాలచంద్రుడు, బాల అకాడమీ కరస్పాండెంట్ రవీంద్రనాథ్, కాశీగారి శ్రీనివాసులు, గాజుల రమణ, ఆదినారాయణ పాల్గొని నూతన సంవత్సర క్యాలండర్ ను ఆవిష్కరించారు.

ఐక్యతతోనే గిరిజనుల హక్కుల సాధన

విశాలాంధ్ర - నంద్యాల : జీవో 52ను ప్రభుత్వం వెంటనే ఉపశమహరించుకోవాలని, ప్రభుత్వానికి వత్తాసు పలికే నాయకులు వెంటనే రాజీనామా చేయాలని, రాష్ట్రంలో ఏ ఇతర కులాలను ఎస్టీ జాబితా చేర్చోద్దంటూ గిరిజన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. నంద్యాల పట్టణం సూరజ్ హోటల్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం గిరిజన ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ బోయ,వాల్మీకి బెంతు ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీల్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ను

రద్దు చేయాలని కోరారు. జీవో నెంబర్ 52 రద్దయ్యేంతవరకు పోరాటం ఆగదని రౌండ్ టేబుల్ తీర్మానించింది. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడు, బంజారా ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం నాయక్,జీపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలునాయక్, రవీంద్ర నాయక్, వైస్ ఎంపీపీ కోదావత్ శంకర్ నాయక్, గిరిజన ప్రజా సంఘాల సోదరులు పాల్గొన్నారు.

5 నుంచి నాటక,సాహితీ ఉత్సవాలు

విశాలాంధ్ర - నంద్యాల : అజో విభో కందాళం ఫౌండేషన్, నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో 30వ వార్షిక తెలుగు రాష్ట్రాల నాటక, సాహితీ సాంస్కృతిక ఉత్సవం జనవరి 5, 6, 7, 8 తేదీలలో నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్లో నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానిక మధు మణి నర్సింగ్ హోమ్ హాల్లో నిర్వహించిన నిర్వాహక కమిటీ సమావేశంలో నిర్వాహక కమిటీ గౌరవ చైర్మన్, కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,నిర్వాహక చైర్మన్, కళారాధన ప్రధాన కార్యదర్శి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కళారాధన నాటక విభాగ కార్యదర్శి ఎస్ఆర్ఎస్ ప్రసాద్ ఏర్పాట్లను సమీక్షించి వివిధ బాధ్యతలను కమిటీ సభ్యులకు కేటాయించారు. పాత్రికేయులతో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ జనవరి 5, 6, 7 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుండి రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రత్యేక పరిశీలనలో ఎంపిక చేసిన అత్యంత ఆసక్తికరమైన ఏడు సాంఘిక నాటికల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

ప్రదర్శించే నాటికల వివరాలు : ఐదవ తేదీ మినిస్టరోత్తండు, తెల్ల కలువ నల్లకోయిల, స్వర్ణ కమలాలు ఆరవ తేదీ కొత్త పరిమళం, అగ్ని సంస్కారం, ఏడవ తేదీ థాంక్స్ ఫర్ ద పీఎం, ప్రేమతో నాన్న నాటికల్ని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ రంగస్థల సంస్థలు ప్రదర్శిస్తారని తెలిపారు.

ఆరవ తేదీ "సరిలేరు నీకెవ్వరు" విశిష్ట బాలసాహిత్య రచనా పురస్కారం కర్నూలుకు చెందిన డాక్టర్ హరికిషన్ కు 25 వేల నగదు బహుమతి, ఏడవ తేదీ "విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కారం" డాక్టర్ పల్లెటి లక్ష్మీ కులశేఖర్ కు 50 వేల నగదు పురస్కారం, ఎనిమిదో తేదీ ప్రతిష్టాత్మక ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం లక్ష రూపాయల నగదు బహుమతి ప్రొద్దుటూరుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ కోడూరు ప్రభాకరరెడ్డికి అందజేసి ఘనంగా సత్కరిస్తారు. ఈ కార్యక్రమాల్లో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పురపాలక చైర్మన్ మాబున్నీసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ దస్తగిరిరెడ్డి, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్. అనంత పద్మనాభరావు, శ్రీ వెంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయ ఉపకులపతి సదాశివమూర్తి, ద్రవిడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రముఖ రచయితలు, కవులు, రంగస్థల కళాకారులు పాల్గొంటారు.

తెలుగు రచయిత మహాసభలు

విశాలాంధ్ర-నందికొట్కూరు : విజయవాడలో జరిగిన ఐదవ తెలుగు రచయిత మహాసభలకు దళిత రత్న, రచయిత సీనియర్ జర్నలిస్ట్ గుంపుల వెంకటేశ్వర్లు హాజరు కావడం జరిగిందనీ ఆదివారం విలేకరులకు తెలియజేశారు. ఈనెల 23, 24 తేదీలలో విజయవాడలోని పీవీ నరసింహారావు వేదిక లలో జరిగిన తెలుగు మహాసభల్లో పాల్గొనడం జరిగింది అన్నారు. ఈ మహాసభల్లో ప్రత్యేక కవి సమ్మేళనాలలో పాల్గొని సమాజంలో తరతరాలుగా సాగుతున్న కుల అసమానతలపై హెచ్చరిక అనే కవితను చదివి ప్రశంసాలు అందుకున్నారు. ఈ తెలుగు మహాసభలకు హాజరైన ఎంతోమంది కవులు, రచయితలు గుంపుల వెంకటేశ్వర్లు ను అభినందించడం జరిగిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు అవుతున్న దళితులు అంటరానితనానికి, వివక్షకు గురవుతున్నారని ఇప్పటికైనా సమాజంలో మార్పు రావాలని కోరారు.

విశాలాంధ్ర-మిడుతూరు: కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర సిద్ధార్థ అకాడమీ విజయవాడ సౌజన్యంతో విజయవాడలో 23 24 తేదీలలో జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు దళితరత్న రచయిత అవుకు లో నీటిపారుదల శాఖలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న గుంపుల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పివి నరసింహారావు వేదిక మహాసభల ప్రత్యేక కవి సమ్మేళన పాల్గొన్నారు. గుంపుల వెంకటేశ్వర్లు సమాజంలో తరత రాలుగా కొనసాగుతున్న కుల అస మానతలు వీక్షతో అంటరాని తనం పై " హెచ్చరిక " అనే కవితను చదివి. ప్రశంసలు అందుకున్నారు.5వ ప్రపంచ తెలుగు రచయితలమహాసభలో పాల్గొన్న గుంపుల వెంకటేశ్వర్లను పలువురు అభినందించారు.

పేద ప్రజల ఆకలి తీర్చిన సేవా సమితి

విశాలాంధ్ర-డోన్ : స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులు పట్టణంలో గల పోచా కాలనిలో వుండే నిరుపేద కుటుంబాలకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించి నిరుపేదల ఆకలి తీర్చారు. ఆదివారం పట్టణానికి చెందిన సాయిరామ్ హాస్టల్ నిర్వాహకులు, సేవామూర్తి నంద కిశోర్ సహకారంతో పేద ప్రజల ఆకలి తీర్చడం జరిగిందని స్ఫూర్తి సభ్యులు అలా మధు తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సభ్యులు సాయిరామ్ హాస్టల్ వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జగదీష్, యోగ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రహిత ఋణాలు పంపిణీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాలలో గత మూడు నెలల క్రితం

స్థాపించబడిన ఖిద్మత్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో పది మందికి వడ్డీ రహిత ఋణం పంపిణీ చేశారు. స్థానిక బ్రాంచి అధ్యక్షులు నవాజ్ ఖాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త, మహేంద్ర గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ పార్టనర్ షేక్ వాహీద్ హుసేన్, నంద్యాల జమాఅతె ఇస్లామీ ఇహింద్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్, పదవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మజిద్, మంజూబాషా దర్గ పీఠాధిపతి మంజు మొయినుద్దీన్ సాహెబ్ పాల్గొని పది మందికి రెండు లక్షల రూపాయలు పైబడి పంపిణీ చేసారు. వహీద్ హుసేన్ మాట్లాడుతూ మూడు నెలలోనె నంద్యాల ఖిద్మత్ సొసైటి ఋణాలు తన చేతులు మీదుగా పంపిణీ చేయడం చాలా సంతోషకరమని,జమాతె ఇస్లామి పర్యవేక్షణలో బ్యాంక్ సేవలు చాలా హుందాగా పారదర్శకంగా మతాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బ్రాంచి సభ్యులు జకరియా, ముస్తఫా, బ్యాంక్ మేనేజర్ ముహమ్మద్ ఫయాజ్,అకౌంటెంట్ నూరుల్ హఖ్, సిబ్బంది బద్రుజమా,ఫయాజ్,ఇంకా పెన్నాల షఫీ,వరంగల్ సలీం పాల్గొన్నారు.

ఘనంగా వాజ్ పేయ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-బనగానపల్లె: దేశ అభివృద్ధికి బాటసారి వాజ్ పేయ్ అని బిజెపి

ఓబిసి జిల్లా అధ్యక్షులు శివ కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షుడు శరత్చంద్ర కుమార్ అధ్యక్షతన భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి 98వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు శివ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఇవాళ దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి అంటే నాడు ప్రధానమంత్రిగా వాజ్ పేయ్ తీసుకున్న నిర్ణయాలు వలనే అది సాధ్యమైందన్నారు. వేణు యాదవ్, యాదగిరి, సీతారామయ్య, శివరామిరెడ్డి , మల్లికార్జున, రాజు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్ : పట్టణంలోని పలు చర్చీలలో క్రిష్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదర,సోదరీ మణులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి చర్చీలలో ఆసీనులై ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించి,యేసు క్రీస్తు యొక్క నామధ్యేయాన్ని స్మరించుకున్నారు. అదే విధంగా పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఎస్సి సెల్ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడైన మేకల నాగరాజు స్వగృహంలో నిర్వహించిన క్రిష్మస్ వేడుకల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ధర్మారం సుబ్బారెడ్డి పాల్గొని కేకు కట్ చేసి, క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ యేసు ప్రభు సమస్త మానవాళి శ్రేయస్సు కోసం ఉద్భవించిన లోకాతత్పురుషుడు కొనియాడారు. మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టౌన్ అధ్యక్ష,కార్యదర్శులు ప్రసన్న లక్ష్మీ,షేక్షావలి చౌదరి,కౌన్సిలర్స్ అంజి,రామ గోపాల్,ఎస్సి సెల్ అధికార ప్రతినిధి రూబెన్,పోలూరు వెంకటేశ్వర రెడ్డి,రాఘవ రెడ్డి,అరుణ్,పుల్లయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర-చాగలమర్రి : మండలంలో ఏసుక్రీస్తు జన్మదినము పురస్కరించుకొని క్రిస్టమస్ వేడుకలు ఊరు ఊరునా వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుండి ప్రత్యేక ప్రార్థనలు ఆయా గ్రామాల చర్చిలలోని చర్చి ఫాదర్ లు నిర్వహించారు. క్రీస్తు పుట్టుక చారిత్రాత్మకంగా జరిగిందని రుజువు ఆనందం ఆనవాళ్ళతో కూడిన క్రీస్తు జననం జరిగిందని పెద్ద బోధనం సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవ.సంపత్ కుమార్ తెలిపారు. క్రీస్తు జననం తోనే జనాభా లెక్కలు జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రైస్తవులను ఉజ్జ్వలింప చేశారు.

విశాలాంధ్ర - శిరివెళ్ళ : ప్రేమ, కరుణకు ప్రతీక జీసస్ అని, క్రీస్తు జననం శాంతికి సంకేతమని పలువురు ఫాష్టర్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుండే ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్టియన్ ప్రార్థన మందిరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా జీసస్ మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సేవాతత్పరతను, ప్రేమ దయ కరుణ సోదరభావం, మానవతా దృక్పథం పెంపొందించుకోవాలన్నారు.

విశాలాంధ్ర-రుద్రవరం : లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రభువుల వారు తన్నుతాను తగ్గించుకొని సర్వమానవాళి రక్షణార్థమై పశువుల పాకలో జన్మించి తగ్గింపు స్వభావానికి క్రీస్తు ప్రతి ఒక్కరికి నిదర్శనంగా మారాడని రెవరెండ్ ఆనంద్ క్రిస్మస్ పండుగ సందర్భంగా సందేశాన్ని అందించారు. ఆదివారం క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని పెద్దకమ్మలూరు, కోటకొండ, బీరువోలి,చిన్న కంబలూరు, పేరూరు ,నరసాపురం, ఆలమూరు, ముకుందాపురం తదితర గ్రామాలలో ని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా సంగస్తులు అలంకరించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు గ్రామాలలో సిలువ ఊరేగింపు కార్యక్రమాన్ని సంఘ పెద్దలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆదివారం పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో రెవ ఆనందు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని లేఖనాల నెరవేర్పు విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ తగ్గింపు స్వభావానికి ఏసుక్రీస్తు ప్రభువును ఆదర్శంగా తీసుకొని క్రైస్తవత్వం లో ఉన్న ప్రతి ఒక్కరు తగ్గింపు స్వభావంతో క్రీస్తును అనుసరిస్తూ సమాజంలో జీవించాలని బోధించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు పెద్దలు ఏర్పాటు చేశారు. చిన్నారుల నృత్యాలు పలువురిని అలరించాయి.

విశాలాంధ్ర-నందికొట్కూరు : నందికొట్కూరు మండల పరిధిలోని దామ గట్ల, వడ్డేమాన్, కొణిదెల, అల్లూరు, బొల్లవరం గ్రామాలలో మరియు పట్టణ కేంద్రంలోని సిఎస్ఐ, ఏబీ ఎం చర్చలలో ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఆదివారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఏసుక్రీస్తు అర్ధరాత్రి పుట్టిన సందర్భంగా క్రైస్తవులు కొత్త దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీంతో చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి. ఆయా చర్చల పాస్టర్లు దైవ సందేశాన్ని క్రైస్తవ భక్తులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్ సిఎస్ఐ చర్చిలో కౌన్సిలర్ లాలు ప్రసాద్ 150 మంది కుటుంబాలకు ప్లేట్లను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఆయా చర్చలలో కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసుకోవడం జరిగింది.

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని అన్ని గ్రామాలలో క్రిస్మస్ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. శనివారం అర్ధరాత్రి నుండి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున పాస్టర్లు ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. అవుకు పట్టణంలోనీ కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న సిఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు అవుకు జడ్పిటిసి

బేతంచెర్ల రూరల్ లో

చల్లా శ్రీలక్ష్మి,పట్టణ మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి, స్వర్గీయ శాసన మండల సభ్యులు చల్లా భగీరథ్ రెడ్డి కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.జెడ్పిటీసి చల్లా శ్రీ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజే స్తున్నాను అని అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని శాంతికి చిహ్నంగా క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకోవడం చాలా సంతోషమని అన్నారు. సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే మీ ఆశీస్సులు ఎప్పుడూ చల్లా కుటుంబంపైఉండాలని అన్నారు.

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండలంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. కరుణామయుడు జన్మదిన సందర్భంగా ఆయన రాకను స్మృతిస్తూ ప్రార్థన మందిరాల్లో శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలోని సిఎస్ఐ, హోసన్నా, ఎరుసలెం మందిరాల్లో పెద్దలు, చిన్నారులు ఉపవాస దీక్షలతో ఏసుక్రీస్తు దీవెనల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పాస్టర్లు రమేష్ బాబు రవికుమార్, రాజు,హిట్లర్‌భక్తులకు దైవసందేశాన్నిచదివి వినిపించారు.

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా : క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం జూపాడు బంగ్లా, తరిగోపుల,మండ్లెమ్,బన్నూరు,తర్తురు,తూడిచెర్ల, పారుమంచాల, భాస్కరపురం,లింగాపురం, తదితర గ్రామాలలో భక్తులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే భక్తులు ఆయా గ్రామాలలోని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు సిలువను ఆయా గ్రామాలలోనీ వీధులలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. స్వార్థ చింతన వీడి దేవుని మార్గాన్ని అనుసరించి,ప్రజలందరూ మారుమనసు పొంది రక్షణ మార్గములో నడవాలని పాస్టర్లు దేవుని వాక్యమును బోధించారు. రాబోవు 2023 సంవత్సరం అంతయు ప్రజలందరూ దైవమార్గం అనుసరించి, సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని వారు తెలియజేశారు.

శిరివెళ్ల లో

రుద్రవరం లో

నందికొట్కూరు లో

అవుకు లో

చాగలమర్రి లో

ఉయ్యాలవాడ లో

విభేదాలు పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడదాం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : వర్గ విభేదాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతం కోసం కష్టపడదామని వైయస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షులు,నగర మేయర్ బి.వై. రామయ్య సూచించారు. ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఇటీవలే రాజీనామాకు సిద్ధపడ్డ చిప్పగిరి జెడ్పీటీసీ బి.విరుపాక్షి ఆయన అనుచరులతో బి.వై. రామయ్య, వైయస్ఆర్ సిపి సంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి లు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ స్థానికంగా కొన్ని కొన్ని సమస్యలు అన్ని పార్టీల్లో ఉంటాయని, వాటిలాగే చిప్పగిరి నాయకుల సమస్య ఒకటన్నారు. కొన్ని ఘటనల చూసి ఆవేశంలో జెడ్పీటీసీ విరుపాక్షి రాజీనామాకు వెనుకాడబోమని మాత్రమే చెప్పారని, దీనిని ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులు వారికి అనుకూలమైన మీడియా ద్వారా ఏదేదో జరిగిపోతున్నట్లుగా హడావుడి సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పెద్దల ద్వారా అందరిని త్వరలో ఒక్కతాటిపైకి తెస్తామన్నారు.జెడ్పీటీసీ విరుపాక్షి మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వైయస్ రాజశేఖరరెడ్డికి తాను వీరాభిమానిని, అందుకే పార్టీ స్థాపించినప్పటి నుంచి ఆ కుటుంబంతోనే నడిచినట్లు పేర్కొన్నారు. అందుకే గత స్థానిక ఎన్నికల ముందు తాను అడగకపోయినా, చిప్పగిరి మండల నాయకులు అభీష్టం మేరకు పార్టీ బీ ఫాం ఇచ్చిందని, తర్వాత ఇతర పార్టీల నాయకులతో మాట్లాడి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విరుపాక్షి పేర్కొన్నారు. అయితే కొన్నాళ్ళుగా స్థానికంగా కొన్ని ఘటనలు బాధ కలిగించాయని, అందుకే ఇటీవల రాజీనామా చేయడానికి వెనుకాడబోనని చెప్పానన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బి.వై. రామయ్య ఫోన్ చేసి రమ్మన్నారని, తొందరపాటు వద్దని పార్టీ పెద్దలను కలిపించి, సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీనిచ్చారన్నారు. తనకు ఎప్పుడూ పదవి వ్యామోహం లేదని, పెద్దలు ఏం చెప్పినా చేస్తానని అతిత్వరలో పార్టీ పెద్దలను కలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, నాగప్ప, మల్లికార్జున,లోకనాథ్ మహానంది, హనుమంత్, పెదిపెద్దయ్య, శ్రీరాములు, రాము, రామాంజనేయులు, వెంకటేష్, ధనుంజయ. జ్ఞాన రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

వేదవతిని ఎనిమిది టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలి

సీమ ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం
సంపద సృష్టిలో ముఖ్యమంత్రి విఫలం
వేదవతిని ఆస్పరికి వర్తింపజేయాలి
పండుగలా సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవం
సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-ఆస్పరి : కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల జీవనాడి అయినా వేదవతి ప్రాజెక్టు ను 8 టీఎంసీల సామర్థ్యం తో నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గం నిత్యం కరువు కాటకాలకు నిలయంగా మారిందని, ప్రతి ఏడాది కూడా ఈ ప్రాంతం నుండి వేల సంఖ్యలో ప్రజలు, రైతులు, యువకులు వలసలకు వెళుతుండటంతో ఈ ప్రాంతం వలసలకు నిలయంగా మారిందన్నారు. నియోజకవర్గంలో దేవనకొండకు హంద్రీనీవా, హొలగుందకు ఎల్.ఎల్.సి, చిప్పగిరికి ఏబీసీ కెనాల్, నగరడోన రిజర్వాయర్, హాలహర్వికి హెచ్ ఎల్ సి, ఆలూరు కు వేదావతి సాగు తాగు నీటి పథకాలు ఉన్నాయని, కానీ ఆస్పరి మండరానికి మాత్రం సాగు, తాగునీరు అందించే ఎలాంటి పథకాలు లేవని, వేదవతి ప్రాజెక్టు లోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడిన మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం 100 కోట్లు కేటాయిస్తే, ఈ ప్రాజెక్టును మెగా కంపెనీ వారికి 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని పనులు అప్పగించడం జరిగిందన్నారు. అయితే పనులు చేసిన గుత్తేదారులకు నేటికి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. నిధులు కేటాయింపులో వేదావతికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఎస్టిమేషన్ ఖర్చులు కూడా పెరిగిపోయాన్నారు. ప్రభుత్వం మాటలు చెబుతూ శంకుస్థాపనలకు మాత్రమే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం సంపదను సృష్టించలేదని.. ఉత్పత్తి ఏమీ లేదని, వేల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడుతున్న పరిశ్రమలను ప్రభుత్వం కక్షకట్టడంతో రాష్ట్రంలోని పలు పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో ఎక్కడ కూడా ప్రాజెక్టు నిర్మాణము పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగిన దాఖలు లేవని, రాబోవు కాలంలో రాయలసీమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీమ ద్రోహిగా నిలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రభుత్వం సంక్షేమం పేరుతో అభివృద్ధిని విస్మరించిందన్నారు. సంవత్సర కాలంలో ఎన్నికలు వస్తున్నాయని, కానీ ఇప్పటివరకు సీమ ప్రాజెక్టుల నిర్మాణపు పనులకు అతీగతీలేదని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టును 8 టి.ఎం.సి ల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టాలని భవిష్యత్తులో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు గిడ్డయ్య తెలిపారు. అలాగే భారత కమ్యూనిస్టు పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, సోమవారం అన్ని గ్రామాల శాఖలలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి రాజశేఖర్, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకుల అంజినయ్య, ఏఐవైఎఫ్ మండలాధ్యక్షులు లక్ష్మణ, హమాలీ యూనియన్ మండల నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోయిలకొండలో వరి గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-క్రిష్ణగిరి : ప్రమాదవశాత్తు ఒక రైతుకు సంబంధించిన వరి గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రైతు కోలంట్ల రామకృష్ణ వివరాల మేరకు తనకున్న పొలంలో వరి వేయడం జరిగిందన్నారు.వరిగడ్డిని కళ్ళం దొడ్డిలో తోలు పెట్టుకొనగా మధ్యాహ్నం 12 గంటలకు సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు రగులుకొని వరిగడ్డి దగ్ధమైందన్నారు. ఐదు బండ్ల గడ్డి కాళీ బూడిద అయినట్లు నష్టం 20వేలు రూపాయలు జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

నిందితులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-ఆస్పరి : గోనెగండ్ల మండలం అలువాల గ్రామానికి చెందిన ఆమోస్?ను కర్నూలు నగర శివారు ప్రాంతంలో దుండగులు కిరాతకంగా హత్య చేసి, పెట్రోల్ పోసి తగలబెట్టిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ మండల కన్వీనర్ కొమ్ము రమేష్, మండల నాయకులు శీను లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీ పార్క్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని, దళిత సామాజిక వర్గానికి చెందిన అబ్బాయి ఆమోసు కులాంతర వివాహం చేసుకున్నాడని, ఇది ఓర్వలేక కులం పేరుతో నిండు జీవితాన్ని నాశనం చేశారన్నారు. కర్నూలు నగరం శివారు ప్రాంతంలో అతి దారుణంగా కత్తులతో పొడిచి, పెట్రోల్ పోసి కాల్చడం దారుణమని, కులాంతర వివాహాలు చేసుకుంటే చంపేస్తారా అని వారు మండిపడ్డారు. ఆమోస్ ది పరువు హత్యేనన్నారు. హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

ఘనంగా కె.సి.తిమ్మారెడ్డి విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర-హొళగుంద : హొలగుంద మండలంలోని ఇంగలదహాల్ గ్రామ అభివృద్ధి కారకులు,విద్యా ప్రధాత దేవరగట్టు ఆలయ కమిటీ మాజీ చైర్మన్, శ్రీశైల ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జ్ఞాపకర్థం అతనికుటుంబ వారసులు ఆదివారం గ్రామంలో కె.సి.తిమ్మారెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది.వారి కుటుంబ వారసులు ముందుగా తిమ్మారెడ్డి కుటుంబ దేవత రంగమ్మ కు పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ సభ్యులు తిమ్మారెడ్డి వారసులను బస్టాండ్ వరకుఊరేగింపుగా తీసుకు వచ్చి అనంతరం విగ్రహ ఆవిష్కరించారు. యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ గ్రామానికి మేము కూడా అన్ని విషయాలలో అండగా ఉండి.గ్రామ అభివృద్ధికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని తెలియజేశారు. అదేవిధంగా గ్రామానికి ఒక గ్రంథాలయం కూడా మా వంతున ఏర్పాటు చేయలనుకున్నాం దానికి కూడా మా సహకారం ఉంటుంది అని తెలియజేశారు. తిమ్మారెడ్డి కుమారుడు హై కోర్టు అడ్వొకేట్ శివారెడ్డి కె.విరభద్రారెడ్డి అడ్వొకేట్ కె.చంద్రకాంత్ రెడ్డి కె.నాగేసేన రెడ్డి కె.హరిక్రిష్ణ రెడ్డి కె.రాఘవ రెడ్డి ఎంపీటీసీ మల్లికార్జున, వెంకటరామిరెడ్డి, ఎం.డి.హళ్లి సర్పంచ్ సుధాకర్ యూత్ అధ్యక్ష,కార్యదర్శులు విరేష్,చంద్రశేఖర్, కె.సి.తిమ్మారెడ్డి మెమోరియల్ పాఠశాల కరస్పాండెంట్ గౌస్,తిమ్మప్ప,గ్రామ పెద్దలు రంగారెడ్డి యూత్ సభ్యులు,విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు గౌరు వెంక రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చరితమ్మ ఆదేశం మేరకు ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం కల్లూరు మండలం లోని బొల్లవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు డి రామాంజనేయులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, కరెంటు బిల్లులు, అవినీతి, నిత్యావసర సరుకులు పెరిగిపోయాయన్నారు. యస్. విజయ్ కుమార్. బి.సుధాకర్. బి.వి. జి.మస్తాన్ నాయుడు.బి. జానకి రాముడు. డి. మస్తాన్ నాయుడు,లక్ష్మమన్న,రమణారెడ్డి, ఎల్లప్ప, బి. సోములు,బీవీజీ. వెంకటేష్, రామ నాయుడు, నాగార్జున గౌడు, గుర్రం మద్ది లేటి,జి. రాజు.తదితరులు పాల్గున్నారు.



సీఎం జగన్ మాట నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర-కర్నూల్ సిటీ : ముఖ్యమంత్రి వైయస్ జగన్ బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య, బ్రాహ్మణ అన్యాక్రాంతుల ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ సముద్రాల హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులకు పాదయాత్రలో 1000 కోట్లు ఇస్తామని ఇచ్చిన మాటను కూడా నెరవేర్చలేక పోయారని విమర్శించారు. బ్రాహ్మణులు చాలా మంది మేడమతిప్పడు మాట తప్పుడు అనే మాటకు కట్టుబడి ఉండి కష్టపడి పని ఎన్నికల్లో పనిచేసి గెలిపించారని,ఇప్పుడు వారంతా ఎందుకు గెలిపించామని బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు కెవి సుబ్బారావు, టి రవిచంద్ర శర్మ, చెరువు వెంకట దుర్గా ప్రసాద్, మేఘన సుబ్రహ్మణ్యం లు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ పండుగ

విశాలాంధ్ర -హొళగుంద : ఆదివారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరిపారు. హెబ్రోను క్రిస్టియన్ అసెంబ్లీ బేరియా క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రార్థన జరిపి ప్రపంచ ప్రజలకు సుఖశాంతులు ఆరోగ్యాలు కల్పించాలంటూ ప్రార్థించారు. చర్చ్ అడ్మినిస్ట్రేటర్ రాగూర్ పాస్టర్లు సామెల్ శివ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరూ ఆచరించాలని ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళిని ప్రేమించారని అందరు ప్రేమానురాగాలతో జీవించాలని కోరారు. ఏసుక్రీస్తు అందరి కోసం జన్మించాడని పాపులను రక్షించి మానవుల పట్ల కరుణ ప్రేమ దయ చూపించాడని ఉపదేశించారు. దేశ ఐక్యత మరియు అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని ప్రపంచ శాంతి కోసం అందరూ నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలన్నీ క్రైస్తవ సోదరులతో భక్తులతో కిటకిటలాడాయి చర్చులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని చిన్నహేట ఎండిహళ్లి ఇంగలేదాహల్ పెద్ద గోనె హేల హెబ్బాన్నారు కొట్టాల మార్లమడకి తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరిపారు. క్రైస్తవ సోదరులపై నక్షత్ర గుర్తు విద్యుత్ దీపాలను వేలాడదీశారు క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులు కొత్త దుస్తులను ధరించారు.

మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఆస్పరి : కరుణామయుడు, శాంతిదూత యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా నిర్వహించే క్రిస్మస్ వేడుకలను ఆదివారం మండలంలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానమాచరించిన క్రైస్తవులు కొత్త దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీంతో చర్చిలన్ని క్రైస్తవులతో కిటకిటలాడాయి. ఆయా చర్చిల ఫాస్టర్లు దైవ సందేశాన్ని క్రైస్తవ భక్తులకు అందించారు. మండల కేంద్రంలోని యేరుషలేము ప్రార్థనా మందిరంలో జిల్లా కేడీసీసీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మేజర్ పంచాయతీ సర్పంచ్ మూలింటి రాధమ్మ దంపతులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే శంకరబండ గ్రామంలో సిబిటి ఆదోని వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు సంఘం చర్చిని ఎంపీపీ సుంకర ఉమాదేవి భర్త మాజీ కన్వీనర్ రామాంజనేయులు చేతిమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ జీవరత్నం చర్చీలకు వచ్చిన భక్తులందరికీ క్రీస్తు సందేశాన్ని వివరించారు. రానున్న రోజుల్లో కరోనా బారి నుంచి ప్రపంచాన్ని క్రీస్తు కాపాడతారని, ప్రపంచంలో ఉన్న ప్రజలందరినీ సుఖ సంతోషాలతో ప్రభువు ఉంచుతారని సందేశం ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జడ్పిటిసి దొరబాబు, సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్ వైకాపా మండల కన్వీనర్ పెద్దయ్య, కొ.కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, టిడిపి నాయకులు ముత్యాల రెడ్డి, దాబా నాగేంద్ర లు పాల్గొన్నారు.

గోనెగండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం గోనెగండ్ల మండల పరిధిలోని గోనెగండ్ల, హెచ్ కైరవాడి, పెద్ద మర్రి వీడు,అలువాల,గంజిహళ్లి,పెద్దనెల్లూటూర్,కులుమాల,వేముగోడు, తదితర గ్రామాల్లో భక్తులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే భక్తులు ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.క్రైస్తవులు,సిలువను,ఆయా గ్రామాలలోని, వీధులలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.స్వార్థ చింతన వీడి దేవుని మార్గాన్ని అనుసరించి, ప్రజలందరూ మారుమనసు పొంది రక్షణ మార్గములో నడవాలని పాస్టర్లు దేవుని వాక్యమును బోధించారు.రాబోవు 2023సంవత్సరం అంతయు ప్రజలందరూ దైవ మార్గం అనుసరించి, సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని వారు తెలియజేశారు.

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట, చిన్నతుంబలం, కంబలదిన్నె, జాలవాడి, హెచ్ మురవణి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో ఆదివారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిలలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు టీడీపీ నేతలు హాజరయ్యారు. మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, టౌన్ సహాయ కార్యదర్శి మీ సేవ ఆంజనేయులు, టీడీపీ నాయకులు అంజీ, దశరథ రాముడు, చిన్నకడబూరు నరసన్న హాజరై పాస్టర్ రెవరెండ్ మనోహర్ బాబు, ఫాదర్ సంజీవరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరిపై క్రీస్తు కృప మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే రమాకాంతరెడ్డి కూతురు నరవ హిమబిందు పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు, సంఘ పెద్దలు, టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, నరసన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ఘంటసాల శతజయంతి

విశాలాంధ్ర-బ్యూరో కర్నూలు : నగరంలోని సునాయన ఆడిటోరియంలో ఘంటసాల గాన కళా సమితి ఆధ్వర్యంలో ఘంటసాల శత జయంతి సందర్భంగా శతాబ్ది గాయకుడికి స్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ,కర్నూలు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ టీజీ భరత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ,ప్రముఖ వైద్యులు డాక్టర్ డబ్బ్యా సీతారాం ,డాక్టర్ శంకర శర్మ ,డాక్టర్ చంద్రశేఖర్,కె.వి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ కల్కూరా, కార్యక్రమం నిర్వాహకులు వాసుదేవ మూర్తి,జగన్నాథ గుప్తా, నరసింహారెడ్డి, ఎలమర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పాడిన పాటల రూపంలో మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఘంటసాల శత జయంతి సందర్భంగా ఘంటసాల గాన కళా సమితి ఆధ్వర్యంలో శతాబ్ది గాయకుడికి స్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన పాటలను పాడటం అభినందనీయమని చెప్పారు. ఘంటసాల కు గొంతు సమస్య వచ్చినప్పటికీ కష్టపడి పాటలు పాడి పాటల పట్ల ఆయనకున్న అభిమానాన్ని తెలియజేశారని చెప్పారు. ఘంటసాల పాడిన పాటలను పాడటం ద్వారా ఈ తరం గాయకులు ఆయన గాన మాధుర్యాన్ని గుర్తు చేయడం అభినందనీయమని చెప్పారు. కర్నూలు జిల్లా కళలకు నిలయమని కళాకారులను ఆదరిస్తారని చెప్పారు. అనంతరం కర్నూలు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి భరత్ మాట్లాడుతూ సంగీతం అనేది దేవుడిచ్చిన వరమని అది అందరికీ సాధ్యం కాదని చెప్పారు. ఘంటసాల గాన మాధుర్యాన్ని ఎంత చెప్పినా తక్కువే అవుతుందని ఆయన వివరించారు. ఘంటసాల గానం చేసిన పాటలను వింటే మనసు హాయిగా ఉంటుందని వివరించారు. పాటలు వినడం ద్వారా కొన్ని రకాల వ్యాధులు నయం అవుతున్నాయని వైద్యులు చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు .మనిషి వత్తిళ్లలో ఉన్నప్పుడు పాటలు వినడం ద్వారా దాని నుంచి బయటపడవచ్చు అని వివరించారు. ఈ తరం గాయకులు ఘంటసాల ను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ గాయకులుగా ఎదగాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ,యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్ ,బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని ఘంటసాల గాన కళా సమితి తరఫున ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రముఖ గాయకులచే ఏర్పాటుచేసిన ఘంటసాల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది.

కంకర వేశారు తారు మరిచారు

విశాలాంధ్ర-హొళగుంద : హొళగుంద నుండి ఆలూరు కి వెళ్లి రోడ్డు మరమ్మతులకు రెండున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గడప గడప కార్యక్రమంలో తెలిపారు. అయితే అధికారులు రోడ్డు మరమ్మత్తు కోసం రోడ్డును తవ్వి పెద్ద సైజు కంకరను రాళ్లను పరిచి నిర్లక్ష్యంగా వదిలి వేయడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. కంకర రోడ్డు నే దాటుతూ ప్రజలు భక్తులు షేక్షావలి శేషావలి దర్గాల దర్శనం చేసుకుంటున్నారు. కంకర రోడ్లు ప్రయాణించి అదుపు తప్పిపడితే ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆరోపించారు. రోడ్డు మరమ్మతు చేయాల్సిన అధికారులు బాధ్యతగా పనిచేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం తాగదని ప్రజలు వాపోయారు. ఎంతో రద్దీగా ఉండే రోడ్డులో కంకర రాళ్లు వేసి అధికారులు కాంట్రాక్టులు చెయ్యి దులుపుకున్నారని కంకర మీద డాంబర్ వేస్తే రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ప్రజలు కోరారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.

జడ్పీ హైస్కూల్లో ఆరుబయటి వంట

విశాలాంధ్ర-హొళగుంద : హొళగుంద : జిల్లా పరిషత్ హై స్కూల్ లో దాదాపు రెండు వేల మంది విద్యార్థులు విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థుల కోసం రోజు మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు వడ్డిస్తున్నారు. అయితే మధ్యాహ్నం భోజనం తయారీకి సరైన వంటగది లేక ఆరుబయటే మధ్యాహ్న భోజన తయారీ జరుగుతుందని ప్రజలు తెలిపారు. వాహనాల రద్దీ వల్ల దుమ్ముతో పాటు మైదానమంతా అపరిశు భ్రంగా మారిందని ప్రజలు ఆరోపించారు. పక్కా వంటగది నిర్మిస్తే మధ్యాహ్న భోజన తయారీతో పాటు నిత్యవసర సరుకులు నిలువ ఉంచుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని ప్రజలు తెలిపారు. వంటగది లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వంట మనుషులు వాపోయారు. నాడు నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు మంజూరైనప్పటికీ అధికారులు వంటగది నిర్మించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేశారని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని జడ్పీ హైస్కూల్లో కొత్తగా వంటగది నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

విశాలాంధ్ర-హొళగుంద : హొళగుందలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు ఆదివారం తెలిపారు. స్థానిక బస్టాండ్ నుండి వాల్మీకి సర్కిల్ కు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని ఎత్తయిన భారీ వాహనాలు తిరిగితే విద్యుత్ తీగలు తాకుతాయని దీనివల్ల పెద్ద ప్రమాదం జరగవచ్చని ప్రజలు ఆరోపించారు. విద్యుత్ తీగల మధ్యలో నుంచి విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు ఎత్తైన వాహనాలు తాకి కింద తగిలితే విద్యార్థులు రోడ్డుమీద ప్రయాణించేవారు, ప్రమాదానికి గురవుతారని ప్రజలు ఆందోళన చెందారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాల్సిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేశారని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ తీగల ఎత్తుగా బిగించి ప్రజల రాకపోకలకుతో పాటు వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.